ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 20 ఆగస్టు 2024



నాచు, జమ్ము పేరుకుపోయిన తాగునీటి చెరువు

జాడలేని కుళాయి!



ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు విస్మరించింది. పల్లెల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. కానీ చేతల్లోకి వచ్చేసరికి దారుణంగా విఫలమయ్యారు. జలజీవన్ మిషన్ పథకం పనులను అటకెక్కించారు. ఐదేళ్లు పనులను సాగదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలజీవన్ పథకంపై పల్లె ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికల మందు కూటమి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాల్సి ఉంది.



ఓవర్ హెడ్ ట్యాంక్

- అటకెక్కిన జలజీవన్ పథకం
- నీటి పథకాల పనుల సాగదీత
- పల్లెల్లో తాగునీటికి వెతలు
- నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
- మూడు జిల్లాల్లో 10.32 లక్షల గృహాలు
- కుళాయిలు ఉన్న గృహాలు 4.51 లక్షల గృహాలు
- కుళాయిల శాతం 43.66
- రాష్ట్రంలోనే చిట్ట చివరన పల్నాడు జిల్లా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జల్ జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించారు. ప్రధానంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని సేవించడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి, నకరికల్లు మండలాలతో పాటు, గురజాల, మాచర్ల నియోజక వర్గాలలోని అనేక గ్రామాలలో ఫ్లోరైడ్ నీటినే ప్రజలు సేవిస్తున్నారు. ఈ గ్రామాలన్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్ జీవన్ పథకం లక్ష్యం. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రతి వ్యక్తికీ 40 లీటర్లు నీరు ఇచ్చే విధంగా రూపొందించారు. వీటి సామర్థ్యం పెంచాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన పనులను గుర్తించి చేపడుతున్నారు. 2019లో ఈ పథకాన్ని అమలోకి తీసుకొచ్చారు. తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని కేంద్రం సంకల్పించింది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ. 1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్రం తన వాటాగా సుమారు రూ. 275 కోట్లు నిధుల విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా సుమారు రూ. 105 కోట్లు విడుదల చేసింది. ఇంకా మిగతా నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడం మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. నిధుల కొరత వెంటాడుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేస్తున్నారు.

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,51,267 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. 43.68 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,81,637 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాలలో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపు లైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.

బాపట్ల జిల్లాలో..

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 76,033 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాల్లో 1,48,325 గృహాలకు మాత్రమే కుళాయి కనక్షన్‌లు ఉన్నాయి. 19.82 శాతం నుంచి 40.64 శాతంకు కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 2,16,463 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్‌లలో చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ 205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి. 10 గ్రామల్లో నూరు శాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కోరుతాడిపర్రు, ఇంకొల్లు మండలం భీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దన పూడి మండలం వింజనంపాడు గ్రామల్లో మాత్రమే నూరు శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

పల్నాడు జిల్లాలో ..

పల్నాడు జిల్లాలోని గ్రామాలలో 4,34,399 గృహాలు ఉన్నాయి. జల్ జీవన్ పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 87,052 కుళాయిలను ఇచ్చారు. జిల్లా అంతటా 1,45,218 గృహాలకు కుళాయిలు ఉండగా ఇంకా 2,89,328 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. 33.43 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్ట చివరన నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులు గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ 508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు పూర్తయ్యాయి. మూడవ వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 13 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది. అమరావతి మండలం జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్కపల్లి వారిపాలెం, పొతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజు పల్లి గ్రామల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయని అధికారులు తెలిపారు.



జలజీవన్ మిషన్ పథకం పైపులు

గుంటూరు జిల్లాలో ...

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతంకు కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 75,993 గృహాలకు కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. ఈ గ్రామల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పాండ్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జెడపల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కోవెలమూడి, కుర్నూతల, వట్టిచెరుకూరు, యామర్రు గ్రామాల్లో ఇంటింటికి కుళాయి నీరు సరఫరా అవుతోందని సదరు అధికారులు తెలిపారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉండవల్లిలో మంగళగిరి నియోజకవర్గానికి చెందిన తెలుగు మహిళల అధ్వర్యం లో మంత్రి లోకేశ్‌కు హారతి ఇచ్చి రాఖీలు కట్టారు. ప్రజాదర్బార్ లోనూ లోకేశ్‌కు పలువురు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెమ్మలకు మంత్రి నారా లోకేశ్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

- మంగళగిరి



పోషణ కష్టాలు



- అంగన్వాడీలకు ఆగిన సరుకుల సరఫరా

- జులై నెలలో సగం కేంద్రాలకే కందిపప్పు
- మూడో వంతు కేంద్రాలకు ఆగిన పామాయిల్
- సగం కేంద్రాలతో సరిపుచ్చిన పౌర సరఫరాల శాఖ
- వైసీపీ నిర్వాకంతో కుదేలైన పౌర సరఫరాల కార్పొరేషన్
- ఇప్పటికే దెబ్బతిన చౌక సరుకుల పంపిణీ
- తాజా పరిస్థితులతో అంగన్వాడీలపైనా తీవ్ర ప్రభావం

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంతో నిర్వీర్యమైన వ్యవస్థల జాబితాలో తాజాగా అంగన్వాడీ కేంద్రాలు కూడా చేరుతున్నాయి. అర్థాకలి జీవితాలు గడిపే పేద సాద తల్లులు, పిల్లల ఆకలి తీర్చి పోషణనిచ్చే అంగన్వాడీ కేంద్రాలు నేడు పోషణ కరువై అల్లాడుతున్నాయి. అంగన్వాడీలకు రావాల్సిన సరుకులు రాక మళ్లీ అదే అర్థాకలితో తల్లులు, పిల్లలు అగచాట్లు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకు కారణం పౌర సరఫరాల శాఖ కుదేలైపోవడమే కారణంగా తెలుస్తోంది.

● కందిపప్పు కనుమరుగు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 23 కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 4,405 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని 50 వేల మంది గర్భిణులు, 55వేల మంది బాలింతలు, లక్షా 10 వేల మంది మూడేళ్లలోపు చిన్నారులు, లక్షా 32వేల మంది 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు వీటిద్వారా ప్రతినెలా పోషకాహారాన్ని అందిస్తున్నారు. పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా 5 లీటర్ల పాలు, 25 గుడ్లు, కిలో కందిపప్పు, 3 కిలోల బియ్యం, అరలీటరు మంచినూనె అందిస్తారు. వీటితోపాటు బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్లో మరో వెయ్యి అంగన్వాడీ కేంద్రాలు వున్నాయి వీటిలో సుమారు లక్షమంది బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషణ పొందుతున్నారు. ప్రస్తుతం వారిలో సగం మందికి ఈనెల కందిపప్పు, మూడింట ఒక వంతు మందికి పామాయిల్ అందలేదు.

- గుంటూరు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు 24,418 కిలోల కందిపప్పును అందించాల్సి వుండగా, 8,817 కిలోల కందిపప్పు మాత్రమే అందజేశారు. అరకిలో పామాయిల్ ప్యాకెట్లు 17,494 కేటాయించగా 15,560 ప్యాకెట్లు, ఒకలీటరు ప్యాకెట్లు 1,911కుగానూ 1,119 ప్యాకెట్లు మాత్రమే పంపిణీ చేయగలిగారు. పల్నాడు జిల్లాలో 34,990 కిలోల కందిపప్పుకుగానూ 27,885 కిలోల కందిపప్పును, 21,118 అరలీటరు పామాయిల్ ప్యాకెట్లకుగానూ 17,745 ప్యాకెట్ల పామాయిల్, 4,022 లీటర్ ప్యాకెట్లకుగానూ 1,792 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 20,845 కిలోల కందిపప్పుకుగానూ 18,799 కిలోలు, 13,378 పామాయిల్ అర లీటరు ప్యాకెట్లకుగానూ 10,379 ప్యాకెట్లు, 2,126 లీటరు ప్యాకెట్లకుగానూ 631 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. దీంతో మూడు జిల్లాలో వున్న సగం అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పోషణ అందలేదు.

● సంక్షోభంలో పౌర సరఫరాల కార్పొరేషన్

గత వైసీపీ ప్రభుత్వం పౌర సరఫరాల కార్పొరేషన్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. కార్పొరేషన్‌పేరుతో వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి సంస్థను నిర్వీర్యం చేసింది. దీంతో ప్రతి నెలా సరఫరా చేసి సబ్సిడీ సరుకులు సరఫరా కూడా చేయలేని దీనావస్థకు పౌర సరఫరాల శాఖ దిగజారింది. కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపడుతున్నప్పటికీ సంక్షోభ తీవ్రత కారణంగా సరైన పరిష్కారం కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. అన్ని విధాలుగా సంక్షోభంలో కూరుకుపోయిన పౌర సరఫరాల శాఖ గత రెండేళ్లుగా పేద ప్రజలకు చౌక డిపోల ద్వారా అందించాల్సిన కందిపప్పు, పామాయిల్‌ను కూడా అందించకుండా ఆపేసింది. ఇప్పుడు ఆ సంక్షోభం అంగన్వాడీ కేంద్రాలను చుట్టుముడుతోంది. వైసీపీ హయాంలో ఏడాది క్రితం ఇదే పరిస్థితి వుండగా ఎన్నికలకు రెండు మూడు నెలల ముందు నుంచి పరిస్థితి కొంత మెరుగుపడినట్లు కనిపించింది. తీరా చూస్తే అదే పరిస్థితి మళ్లీ పునరావృతమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోక పోతే అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ కార్యక్రమం పూర్తిగా నీరుగారి పోయే ప్రమాదం కనిపిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

జీజీహెచ్‌కి.. పోలీసు రక్షణ

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడి

గుంటూరు (మెడికల్) ఆగస్టు 19: ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ప్రధాన వైద్య విభాగాల వద్ద పోలీసు రక్షణ ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. సోమవారం ఆసుపత్రి శుశ్రుతాహాల్‌లో జీజీహెచ్‌లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా కోల్‌కతాలో ట్రైనీ పీజీ విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు రక్షణ కల్పించాలని జూనియర్ డాక్టర్లు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లా అధికార యంత్రాంగం ఈ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో వైద్య కళాశాలతో సమన్వయం చేసుకొని పటిష్ఠమైన రక్షణ చర్యలు చేపడతాని వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలు చీకటి ప్రాంతాల్లో జరుగుతున్నాయన్నారు. నగర పరిధిలో అన్ని ప్రాంతాల్లో విద్యుత్తు సౌకర్యం, సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే చీకటి వ్యాపారాలను అడ్డుకోవచ్చన్నారు. ఇలాంటి ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో వచ్చి పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. సదరం ధ్రువీకరణపత్రాలు జారీ చేసే సమయంలో వైద్యులకు తగిన రక్షణ కల్పిస్తామన్నారు.

పక్కా ప్రణాళికలతో రక్షణ వ్యవస్థ: జేసీ

ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో పక్కా ప్రణాళికతో రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ్ తెలిపారు. ఆసుపత్రి బయట ప్రహరీ గోడను ఆనుకొని వ్యాపారాలు చేస్తున్న వారి గురించి గుంటూరు నగర పాలకసంస్థ కమిషనర్‌తో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పోలీసులు, నగర పాలకసంస్థ అధికారులతో చర్చించి జీజీహెచ్‌లో చేపట్టాల్సిన భద్రత చర్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పటిష్ఠమైన పోలీసు రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా రాత్రిళ్లు అసాంఘిక శక్తులు ఆసుపత్రిలో చొరబడుతున్నాయని తెలిపారు. ఇలాంటి వారిపై పోలీసులు నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఎస్ పోవార్ జగన్నాథ్, ఆర్‌డీవో శ్రీకర్, జీఎంసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే, సబ్ డివిజన్.. సర్టిఫికెట్ల కోసం పాట్లు

- ఒకరి మీద ఒకరు చెప్పుకొంటున్న కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు
- కలెక్టర్, ఆర్‌డీవోలకు ఫిర్యాదు చేసిన బాధితులు

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏదైనా ఆస్తి, ఖాళీస్థలానికి సంబంధించి సర్వే, సబ్ డివిజన్ సర్టిఫికెట్ల కోసం ఎవరికి దరఖాస్తు చేసుకోవాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. నగరపాలకసంస్థకు టౌన్ సర్వేయర్ ఉన్నప్పటికీ ఆ బాధ్యత తమది కాదంటూ తప్పించుకొనే ప్రయత్నం జరుగుతున్నది. కొన్ని నెలల క్రితం వరకు టౌన్ సర్వేయర్ తన వద్దకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సర్వే, సబ్ డివిజన్ సర్టిఫికెట్లను జారీ చేసేవారు. అయితే గత కమిషనర్ కీర్తి చేకూరి ఈ విషయంలో బాధ్యత పూర్తిగా రెవెన్యూ అధికారులదేనని పేర్కొంటూ ఏ దరఖాస్తు అయినా తహసీల్దార్‌కు పెట్టుకోవాలని ప్రొసీడింగ్స్ జారీచేశారు. అయితే రెవెన్యూ అధికారులు కార్పొరేషన్‌కు టౌన్ సర్వేయర్ ఉండగా తాము వాటిని స్వీకరించకూడదని తప్పించుకొంటున్నారు. దీంతో కొన్ని నెలల నుంచి ఆయా సర్టిఫికెట్లు పొందలేక అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు.



గుంటూరు నగరంలో కొన్ని దశాబ్ధాల క్రితం టౌన్ సర్వే జరిగింది. అయితే అప్పట్లో కొరిటెపాడు, ఏటీ అగ్రహారం వంటి అనేక గ్రామాల పరిధిలోని భూముల సర్వే జరగలేదు. కాలక్రమంలో నగరం విస్తరించింది. అనేక గ్రామాలు కార్పొరేషన్‌లో కలిసిపోయాయి. భవనాలు, అపార్టుమెంట్‌ల నిర్మాణం జరిగింది. నగరపాలకసంస్థకు పన్నులు చెల్లిస్తూ సదుపాయాలను ప్రజలు అనుభవిస్తున్నారు. అయితే వారి ఆస్తులకు సంబంధించిన పత్రాల్లో టౌన్ సర్వే నెంబరు ఉండదు. డీ నెంబరుతో ఉంటుంది. అలానే సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్(ఎస్ఎఫ్ఏ)/రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్(ఆర్ఎస్ఆర్) కింద రిజిష్టర్ అయి ఉన్నాయి. వీటికి కూడా గతంలో టౌన్ సర్వేయరే సర్టిఫికెట్ ఇచ్చేవారు. అయితే గత కమిషనర్ కీర్తి చేకూరి ఉన్న సమయంలో ఎఫ్-లైన్ పిటీషన్లు చాలా పెండింగ్‌లో పడ్డాయి. అనేక ఫిర్యాదులు ఆమెకు ప్రతీ సోమవారం అందడంతో ఇతర మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఏ విధానాన్ని అవలంభిస్తున్నారనేది అధ్యయనం చేశారు. అనంతరం ఈ ఏడాది జనవరిలో ఒక సర్క్యులర్‌ని జారీ చేశారు. దాని ప్రకారం టౌన్ సర్వే/ఎల్‌పీ నెంబరు ఉన్న దరఖాస్తులు మాత్రమే సిటిజన్ ఛార్టర్ కౌంటర్‌లో స్వీకరించాలని ఆదేశించారు. మిగతా సర్వే నెంబర్లు ఉన్నవి స్వీకరించొద్దన్నారు. అలానే అప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల న్నింటిని మండల సర్వేయర్/డిప్యూటీ సర్వేయర్‌తో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి డిస్పోజ్ చేయాల్సిందిగా ఆదేశించారు.

ఈ సర్క్యులర్‌పై వివాదం చెలరేగి చివరికి అప్పటి కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. అప్పటికే ఎన్నికల వాతావరణం వచ్చేయడంతో ఆయన దానిని పక్కన పెట్టేసి వెనక్కు పంపించేశారు. ఇప్పుడు టీఎస్/ఎల్‌పీ నెంబరు కాకుండా మరే ఇతర నెంబర్లతో సర్వే, సబ్ డివిజన్ కోసం దరఖాస్తు చేసుకొంటే వాటిని మునిసిపల్ వర్గాలు స్వీకరించడం లేదు. మరోవైపు అటు గుంటూరు తూర్పు, పశ్చిమ మండలాల తహసీల్దార్ల కార్యాలయాల్లోనూ తీసుకోవడం లేదు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల జాయింట్ ఇన్‌స్పెక్షన్ పూర్తికాక దరఖాస్తు చేసుకొని నెలల తరబడి భూయజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి తాజాగా ఫిర్యాదు అందింది. ఈ విషయంలో ఆమె ఏమి నిర్ణయం తీసుకొంటారనేది ప్రశ్నార్థకంగా మారింది.


అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్న పెమ్మసాని, నసీర్, రాజేంద్ర ప్రసాద్

ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు: కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రూ.200 ఖర్చుపెట్టినా కాఫీ, టీలు దొరకని ఈ రోజుల్లో కేవలం రూ.5కే అన్నం పెట్టడం అంటే సాధారణ విషయం కాదని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు బస్టాండు సమీపంలో ఇటీవల ప్రారంభించిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నసీర్, కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత రాజేంద్రప్రసాద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. అన్న క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలకు దగ్గరుండి వడ్డన చేశారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, సౌకర్యాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అక్కడే వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. నిత్యం 350మందికి ఒక్కో అన్న క్యాంటీన్ ద్వారా భోజనం అందిస్తున్న ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. భోజనం రుచికరంగా వుందని ఆయన చెప్పారు. పరిసరాలు, మెనూ సంతృప్తికరంగా వుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనపై పెమ్మసాని పిలుపునందుకుని చొరవ చూపి తనను కలవడానికి వచ్చిన కాంటినెంటల్ కాఫీ అధినేత రాజేంద్రప్రసాద్‌ను ఆయన అభినందించారు. గుంటూరు జిల్లాలో పరిశ్రమలు లేని రోజున కాంటినెంటల్ కాఫీ సంస్థను స్థాపించిన రాజేంద్రప్రసాద్ వంటివారు నేడు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పలువురు తెలుగు మహిళలు పెమ్మసానికి రాఖీ కట్టారు. ఎల్లప్పుడూ అన్నయ్యలా తోడుంటానని పెమ్మసాని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, పోతురాజు సమత, సయ్యద్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లకు క్యూఆర్ కోడ్ పరికరాల అందజేత


క్యూ ఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను అందజేస్తున్న గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం రామకృష్ణ

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే నుంచి వచ్చిన క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను గుంటూరు డీఆర్ ఎం ఎం రామకృష్ణ డివిజన్ కమర్షియల్ విభాగం అధికారులకు అందజేశారు. సోమవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఆయన సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్, డీసీఎం కమాలకర్‌బాబులకు అందించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ డిజిటలైజేషన్‌లో రైల్వేశాఖ ఎంతోచొరవ చూపుతున్నదన్నారు. ఈ క్యూ ఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలు ప్రయాణీకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. టిక్కెట్ ఛార్జీని క్యూఆర్ కోడ్ స్కానర్‌లో స్కానింగ్ చేసి చెల్లింపు చేయవచ్చన్నారు. దీనివలన నగదు రహిత లావాదేవీలు పెరుగుతాయన్నారు. కౌంటర్ల వద్ద చిల్లర కష్టాలు కూడా తీరిపోతాయని చెప్పారు.

అందరికి అండగా ఉంటా...

- మంత్రి లోకేశ్ భరోసా
- 27వ రోజు ప్రజాదర్బార్‌కు విన్నపాల వెల్లువ


వైద్యసాయం కోసం వచ్చిన వృద్ధుల్ని పరామర్శిస్తున్న లోకేశ్



తాడేపల్లి, ఆగస్టు 19: సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో 27వ రోజు సోమవారం ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. నేరుగా మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి లోకేశ్... అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమస్యల సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

సమస్యలిలా...

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి విచారణ లేకుండా తన భర్తపై అక్రమంగా కేసు నమోదు చేసి, ఇంట్లోని 148 గ్రాముల బంగారాన్ని పోలీసులు దౌర్జన్యంగా తీసుకెళ్లారని మంగళగిరికి చెందిన అందె స్వర్ణలత మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ అంకమ్మరావు, ఎస్ఐ నారాయణ తమను వేధించారని, విచారించి తగిన న్యాయం చేయాలని కోరారు. దివ్యాంగురాలైన తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లికి చెందిన ఎస్ కృష్ణవేణి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరుద్ధరించాలని నవులూరుకు చెందిన సోలా శ్రీదేవి కోరారు. రోజువారీ పనులతో జీవనం సాగించే తనకు రాజధాని రైతు కూలీ పెన్షన్ మంజూరు చేయాలని ఉండవల్లికి చెందిన టి కిషోర్ విజ్ఞప్తి చేశారు. భర్త చనిపోయిన తనకు ముగ్గురు పిల్లల పోషణ కోసం ఎయిమ్స్ ఆసుపత్రిలో సెక్యూరిటీ ఉద్యోగం కల్పించాలని తాడేపల్లికి చెందిన కె.ప్రసన్న కోరారు. వైసీపీ నాయకుల అండగా ఎన్టీఆర్ జిల్లా జి .కొండూరు మండలం చౌటూరులో తమ 220 గజాల స్థలాన్ని కబ్జా చేశారని తగిన న్యాయం చేయాలని మంగళగిరికి చెందిన అడపా మస్తాన్‌రావు విజ్ఞప్తి చేశారు. నర్సింగ్ కోర్సు సర్టిఫికెట్ ఇవ్వకుండా కాలేజి యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని సర్టిఫికెట్ మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రాతూరుకు చెందిన అనూష కోరారు. ఈఎస్ఐ కింద గుండె ఆపరేషన్ చేయించుకున్న తనకు బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కాజకు చెందిన కె శివరామకృష్ణ విజ్ఞప్తి చేశారు. నూతనంగా నిర్మించుకున్న తన ఇంటికి దారి ఇవ్వకుండా వైసీపీ నేతలు అడ్డంగా గోడ కట్టారని, నెల్లూరు జిల్లా వరికుంటపాడు గండిపాలెంకు చెందిన డి తిరుపతమ్మ కన్నీటిపర్యంతమయ్యారు. విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆధారం లేని తమకు ఇల్లు మంజూరుచేసి ఆదుకోవాలని విజయవాడకు చెందిన హరిత విజ్ఞప్తి చేశారు. అగ్రికల్చర్‌లో డిప్లమో చేసిన తాను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సీడ్ ప్రొడక్షన్‌లో శిక్షణ పొందానని తగిన ఉద్యోగం కల్పించాలని ప్రకాశం జిల్లా గద్దలకుంటకు చెందిన పిల్లి ప్రసన్నకుమారి విజ్ఞప్తి చేశారు. కేన్సర్‌తో బాధపడుతున్న తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా మేళ్లవాగుకు చెందిన యు వెంకటేశ్వర్లు కోరారు. వారసత్వంగా వచ్చిన తమ ఏడెకరాల అసైన్డ్ భూమిని వైసీపీ నేతలు నకిలీపత్రాలతో కబ్జా చేశారని విచారించి తగిన న్యాయం చేయాలని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం సాతానుపల్లికి చెందిన కంచర్ల హజరత్తమ్మ మంత్రి లోకేశ్‌ను కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. డ్రిస్టిక్టు స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నియామకంలో నిబంధనలు సడలించి వ్యాయామ ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ఎయిమ్స్‌లో అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 19: మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలో ఆర్టీసీ డిపో నుంచి మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌కు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌ను సోమవారం ఆయన జెండా ఊపి, బస్ స్టార్ట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు కేంద్రప్రభుత్వంతో మాట్లాడి అత్యాధునిక సదుపాయాలతో మంగళగిరిలో ఎయిమ్స్ హాస్పిటల్‌ను ఏర్పాటుచేశారన్నారు. పల్నాడు ప్రాంత ప్రజలు ఎయిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకునేందుకు గుంటూరు వరకు వెళ్లి అక్కడి నుంచి హాస్పిటల్‌కు చేరుకోవడానికి పలు ఇబ్బందులు పడుతున్నారని, వారికోసం ప్రత్యేకంగా నేరుగా హాస్పిటల్ వద్దకు చేరుకునేందుకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో బస్సు సర్వీసు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అనంతరం డిపో మేనేజర్ రెంటచింతల పిచ్చయ్యను అభినందించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, బండ్ల శ్రీనివాసరావు, వజ్రం నాయక్, మదార్‌సాహెబ్, కొమెర శివ, గుండాల శ్రీనివాస్ యాదవ్, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివా రెడ్డి, శేషు, చల్లా రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మమతానురాగాల బంధమే రక్షాబంధన్

- మంత్రి అనగానికి రాఖీ కట్టిన సోదరీమణులు



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు డాక్టర్ మంజుల, డాక్టర్ కమల

రేపల్లె, ఆగస్టు 19: హిందూ సాంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. సోదరి తన సోదరుడికి రాఖీ కట్టటం అంటే సోదరికి జీవితాంతం రక్షగా ఉంటానని సోదరుడు భావించే పండుగ. అన్నాచెల్లెళ్ళు అక్కా తమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు సూచికగా రక్షాబంధన్ పండుగను ఘనంగా సోమవారం జరుపుకున్నారు. శ్రావణమాసం రాఖీపౌర్ణమి సందర్భంగా రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, సోదరుడు శివప్రసాద్‌లకు సోదరీమణులు డాక్టర్ అనగాని మంజుల, కమల రాఖీ కట్టి హారతులు ఇచ్చి మిఠాయిని తినిపించి వారి ఆశీర్వాదం పొందారు. రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లిలో జన్మించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ కుటుంబం తండ్రి రంగారావు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమి రోజున తమ సోదరులైన శివప్రసాద్, సత్యప్రసాద్‌లకు రాఖీ కట్టి వారి ఆశీస్సులు తీసుకుంటామని తెలిపారు. 40 ఏళ్ళ నుంచి వృత్తిరీత్యా వేర్వేరు చోట్ల ఉన్నా రాఖీ పౌర్ణమిరోజున కుటుంబసభ్యులంతా హైదరాబాద్‌లోని తమ స్వగృహంలో చేరి సోదరులకు రాఖీ కట్టి పండుగ జరుపుకుంటామని తెలిపారు.

క్యాంటీన్‌ల వద్ద ఎండలో అవస్థలు

- నీడ కల్పించే అంశంపై అలోచన చేయాలి
- పేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్‌లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్‌లు రోజూ వేలాది మంది కడుపు నింపుతున్నాయి. మూడు పూటలా క్యాంటీన్‌ల వద్ద పేదలు బారులు తీరుతున్నారు. ఒక్కొక్క క్యాంటీన్‌లో నాలుగు రోజుల్లో దాదాపు ఆరువేల మంది అల్పాహారం, భోజనం చేశారు. కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడంలో భరోసా కల్పించింది. ఎంతో ఆనందంగా అన్న క్యాంటీన్‌లకు పేదలు తరలివస్తున్నారు. రుచి, నాణ్యత గల ఆహారాన్ని ప్రభుత్వం క్యాంటీన్ ద్వారా పేదలకు అందిస్తోంది. అన్ని బాగున్నా చిన్న సమస్య పేదలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం సమయాల్లో ఇబ్బందులు లేవు. ఎటొచ్చి మధ్యాహ్నం భోజన సమయంలో క్యాంటీన్ వద్ద పేదలు అవస్థలు పడుతున్నారు. ఆ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుండటంతో క్యాంటీన్ వద్ద క్యూలో ఉండాలంటే చాలా ఇబ్బందిగా ఉందని వారు చెబుతున్నారు. క్యాంటీన్‌ల వద్ద నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం క్యాంటీన్‌ల వద్ద చర్యలు చేపడితే పేదల ఇంకా సంతోషిస్తారు.



నరసరావుపేటలోని అన్న క్యాంటీన్ వద్ద ఎండలోనే క్యూలో ఉన్న పేదలు

ఫొటోగ్రఫీ ఒక శాస్త్రం

- సమాజాన్ని కదిలించేది.. మానవత్వాన్ని చాటేది ఫొటోగ్రఫీ
- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- ఏఎన్‌యూలో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వేదికపై వీసీ గంగాధరరావు తదితరులు

పెదకాకాని, ఆగస్టు 19: ఫొటోగ్రఫీ అనేది ఒక శాస్త్రమని.. దానిని గుర్తించి నేడు ప్రత్యేక కోర్సుగా తీసుకురావడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు ఆధ్వర్యంలో సోమవారం 185వ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ ఫొటోగ్రాఫర్ టి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ సమాజంలోని సంఘటనల గుర్తింపునకు ఒక అస్త్రంగా పనిచేస్తుందన్నారు. ఒక ఫొటో సమాజాన్ని కదిలించేదిగా, అలాగే మానవ త్వాన్ని చాటేదిగా నిలుస్తుందన్నారు. ఆచార్య నాగార్జునవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగానికి ఫొటోగ్రఫీ కోర్సు ఒక ఆణిముత్యం అన్నారు. ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ఒక్క ఫొటో ద్వారా కొన్ని వార్తలను క్రియేట్ చేయవచ్చన్నారు. ఫొటోగ్రఫీ వృత్తిలో ఉంటూ డిప్లమా కోర్సు పూర్తిచేసినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గౌరవ అతిథి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ చదవలేని పుస్తకంగా రాయలేని కవితగా ఫొటోగ్రఫీ నిలుస్తుందన్నారు. జర్నలిజం, ఫొటోగ్రఫీ విభాగాధిపతి డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో జర్నలిజం కోర్సు ద్వారా ప్రతిఏడాది అనేకమంది జర్నలిస్టులను సమాజానికి పంపుతున్నట్లు చెప్పారు. ఫొటోగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో మూడు ప్రత్యేకమైన ఎగ్జిబిషన్లను ఏర్పాటుచేశామ న్నారు. ఈ సందర్భంగా నాలుగు పుస్తకాలను విడుదల చేశారు. కవిత అనే ప్రత్యేక సంచికతోపాటు ఆధునిక ఫొటోగ్రఫీ పితామహుడు జార్జ్ ఇష్టమన్ జీవితంపై పుస్తకాన్ని, ఫొటోగ్రఫీ పదకోశం పుస్తకాన్ని కాంటెస్ట్‌లో విజేతల ఫొటోలతో ముద్రించిన క్యాటలాగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పోటీలకు 800కు పైగా వచ్చిన ఎంట్రీలలో ఉత్తమమైన ఫొటోలను ఎంపికచేసి విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ మధుబాబు, అధ్యాపకులు డాక్టర్ మాణిక్యరావు, ఫొటోగ్రఫీ కోర్స్ అధ్యాపకులు డాక్టర్ విజయభాస్కర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ కోటాలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుకు
21న మాన్యువల్ కౌన్సెలింగ్


లాంఫాం(తాడికొండ), ఆగస్టు 19: ఈనెల 21వ తేదీన బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ ఎన్‌ఆర్‌ఐ కోటాలో మాన్యువల్ కౌన్సెలింగ్ జరుగుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాంఫాంలోని కృష్ణ ఆడిటోరియంలో 21వ తేదీ ఉదయం 9గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఎంపీసీ విభాగంలో బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు, రైతు కోటా కింద మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలియజేశారు. అర్హులైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని పేర్కొన్నారు.

నేడు రాష్ట్ర లీగల్ సెల్ సమావేశం

తుళ్లూరు, ఆగస్టు 19: మండల పరిధిలోని వెలగపూడి సచివాలయం వద్ద గల రాష్ట్ర లీగల్ సెల్ అధారటీలో మంగళవారం జనరల్ మీటింగ్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సోమవారం ఒక ప్రకటలో తెలిపింది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25వేల 550 క్యూసెక్కులు

- డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కులు


ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదలవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 19: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 43వేల క్యూసెక్కుల వరదనీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదలశాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 35 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 25వేల 550 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 19: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 590.00 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడికాల్వ ద్వారా 8067క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 5367, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,110, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,944 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోగా 49,944 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 24వేల క్యూసెక్కుల నీరు విడుదల

1.007 ఎంయూల విద్యుదుత్పత్తి: ఎస్ఈ కె.వెంకటరమణ

రెంటచింతల, ఆగస్టు 19: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టునుంచి దిగువన వున్న పులిచింతలకు 24వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 2 గేట్లను ఒక మీటర్ మేర, 1 గేట్‌ను మీటరున్నర మేర ఎత్తి 15,500, విద్యుదుత్పత్తి అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.007 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. రిజర్వాయర్‌లో 7 టీఎంసీల నీరుండగా ఆ నీరు 74.45 మీటర్లకు సమానమన్నారు. సాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు పంపుతున్నామన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 19: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 16వేల క్యూసెకుక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


బొడ్డు వెంకటరావు (పాత చిత్రం)

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 19: బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అబ్బూరులో సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కంకణాలపల్లి గ్రామానికి చెందిన బొడ్డు వెంకటరావు(32) అబ్బూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వర్కర్‌గా పని చేస్తున్నాడు. విధులకు హాజరైన వెంకటరావు సబ్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చి గ్రామ సమీపంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వ్యవసాయకూలీలు, రైతులు సబ్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బంధువులు ఘటనాస్థలానికి వచ్చి బావిలో నీటిని ఇంజన్ల ద్వారా బయటకు తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వెంకటరావుకు ఏడాదిన్నర క్రితం గణపవరం గ్రామానికి చెందిన శైలజతో వివాహం జరిగింది. వీరికి రెండునెలల వయసున్న బాలుడు ఉన్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

పశ్చిమడెల్టా కాల్వకు 7837 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 19: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 7837క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 25,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 340క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1889, తూర్పు కాల్వకు 767, పశ్చిమకాల్వకు270, నిజాంపట్నంకాల్వకు 458, కొమ్మమూరుకాల్వకు 3260క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

718 బస్తాల పసుపు విక్రయం

స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో 718బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.12,800, మోడల్ ధర రూ.12,800పలికాయి. కాయక్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.12,800, మోడల్‌ధర రూ.12,500 పలికాయి.

కిడ్నీ మార్పిడి బిల్లులు అడుగుతుంటే దాడి చేసి కొట్టారు

- ఆసుపత్రి సిబ్బందిపై ఎస్పీ కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు


యడ్లపాటి సునీత

గుంటూరు, ఆగస్టు 19: తన తల్లికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు సంబంధించి ఆసుపత్రి బిల్లులు ఇవ్వమని అడిగితే తనపై ఆసుపత్రి వైద్యుడి ముందే సిబ్బంది దాడిచేసి కొట్టారని డొంకరోడ్డు 5వ లైన్‌కు చెందిన యడ్లపాటి సునీత అనే మహిళ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... డొంకరోడ్డుకు చెందిన కోటపాటి లక్ష్మి కిడ్నీ దెబ్బతినడంతో ఆమె కుమారుడు సురేష్ కిడ్నీ దానం చేశారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గత ఏడాది మే 26న కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ ఖర్చులకు గాను 8లక్షలు, ఆసుపత్రిలో వివిధ రకాల పరీక్షలకు 3లక్షలు, బయట ల్యాబ్‌లో వైద్యపరీక్షలకు మరో 4లక్షలు మొత్తం రూ.15లక్షల బిల్లు అయిందని కోటపాటి లక్ష్మి కుమార్తె సునీత తెలిపారు. ఈ ఆపరేషన్ నిమిత్తం తమకు డొంకరోడ్డులో ఉన్న ఇంటిని విక్రయించినట్లు తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమేనని, ఈ క్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ కానీ, మెడికల్ రియింబర్స్‌మెంట్ కానీ ఇప్పించాలని కోరుతూ గత నెలలో గ్రీవెన్స్‌లో సీఎం చంద్రబాబును కలిసి వేడుకున్నామన్నారు. ఆపరేషన్‌కు సంబంధించిన మెడికల్ బిల్లులు తెస్తే ప్రతి నెల పెన్షన్‌తోపాటు ప్రభుత్వపరంగా సహాయం అందిస్తామని చెప్పారన్నారు. ఈ క్రమంలో తాము కొద్దిరోజులుగా తమకు ఆపరేషన్ చేసిన ఆసుపత్రి చుట్టూ బిల్లుల కోసం తిరుగుతుంటే వారు సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. చివరకు డొంకరోడ్డుకు చెందిన రమణయ్య అనే వ్యక్తి ఫోన్ చేసి మీకు మెడికల్ బిల్లులు ఇవ్వాలంటే డాక్టర్ జీఎస్టీ 30శాతం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారన్నారు. మెడికల్ బిల్లులు సోమవారం ఇస్తామని పిలిచి, ఆసుపత్రికి వెళ్తే తమపై సిబ్బంది వైద్యుడి సమక్షంలోనే దాడి చేసి కొట్టారని బాధితురాలు సునీత వాపోయారు. తమపై దాడి చేసిన, చేయించిన సిబ్బంది, వైద్యునిపై చర్యలు తీసుకొని తమకు మెడికల్ బిల్లులు ఇప్పించాలని ఆమె పోలీస్ అధికారులను వేడుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

52,954 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 36,162 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 33,928 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 20,098 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	17000	334	8000	16000
నెంబరు. 5	8500	12000	నెంబరు. 5	11700	14200
273	10000	11500	273	11500	14000
341	9000	15500	341	10000	10000
4884	–	–	4884	12000	13500
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18800	తేజ	8500	18500
బ్యాడిగి	9000	14500	బ్యాడిగి	9000	12500
దేవనూరుడీలక్స్	9000	13000	దేవనూరుడీలక్స్	11000	13500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పెమ్మసానికి రాఖీ కడుతున్న ఎమ్మెల్యే మాధవి, పుస్తకాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

పెమ్మసానికి రాఖీ కట్టిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామీణాభివృద్ధి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే సోమవారం రాఖీ కట్టారు. బృందావన్ గార్డెన్స్‌లోని పెమ్మసాని కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టాభిపురంలో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గళ్లా మాధవి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఎన్నారైల ఆస్తులకు రక్షణ కల్పించండి

● జీడబ్ల్యూటీసీఎస్ నేత కృష్ణ లాం



మంత్రి పెమ్మసానికి ఆహ్వాన పత్రం అందిస్తున్న కృష్ణ లాం

గుంటూరు,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఎన్నారైల ఆస్తులకు రక్షణ కల్పించాలని జీడబ్ల్యూటీసీఎస్ సంస్థ అధ్యక్షుడు కృష్ణ లాం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. సోమవారం గుంటూరులో మంత్రిని కలిసి వాషింగ్టన్ డీసీలో జరిగే వేడుకలకు ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికను అంద జేశారు. సెప్టెంబర్ 27,28 తేదీల్లో జీడబ్ల్యూటీసీఎస్ గోల్డెన్‌జూబ్లీ వేడుకలు జరుగుతాయని, ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా కోరారు. అదే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేయాలనికోరారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, సామినేని కోటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, ఘంటా పున్నారావు, వడ్లమూడి నాగేంద్రం, రాయపాటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నసీర్‌కు రాఖీ కడుతున్న కార్పొరేటర్లు, మహిళలు

ఎమ్మెల్యే నసీర్‌కు రాఖీకట్టిన మహిళా కార్పొరేటర్లు

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం గుంటూరు తూర్పు కార్యాలయంలో మహిళా కార్పొరేటర్లు, పార్టీ మహిళా నాయకులు, పలువురు మహిళలు, ఎమ్మెల్యే నసీర్‌కు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించారు. అక్కచెల్లెమ్మలకు ఎప్పుడూ తోడుగా ఉంటానని ఏ కష్టమొచ్చినా వారి వెన్నంటే నిలుస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గ ప్రజలకు రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా ..

ఎన్నికల్లో ఇచ్చిన మాటా నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బాలాజీ నగర్లో సీసీ రోడ్డుకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. 85 లక్షల రూపాయలతో నిర్మించబోయే ఈ సీసీ రోడ్ల వల్ల వందల మంది ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే గుంటూరు తూర్పు నియోజకవర్గం లో మూడు కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, అల్లం బాజీ, జడ సురేష్, శంకర్ తదితర నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదు..

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గుంటూరులోని గొలుసు కొండలరావు నగర్‌లో రూ. 8 లక్షలతో ఏర్పాటు చేసిన 100 కేవీ. జున్ను షాహిద్‌నగర్‌లో రూ.6.50 లక్షలలతో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్లను సోమవారం ఆయన ప్రారంభించారు.

బొప్పాయి రైతులను ఆదుకోవాలి

● ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులకు విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19: నాణ్యతలేని బొప్పాయి విత్తనాలతో నష్టపోయిన అన్నమయ్య జిల్లా రైతులను ఆదుకోవాలని, నాసిరకం నారును అంటగట్టిన నర్సరీ యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పీ.జమలయ్య, రాష్ట్ర నాయకులు కంజుల విఠల్ రెడ్డి, పీవీ జగన్నాథం సోమవారం ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ కే.శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. అనంతరం రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఎకరానికి రెండు లక్షల రూపాయల నష్టపరిహారం నర్సరీ యాజమాన్యాల నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు. కలికిరి, వాయల్పాడు, గుర్రంకొండ, కలకడ, సదుం, పెద్దమండ్యం తదితర మండలాల్లోని గ్రామాల్లో దాదాపు 100 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. రైతులను మోసగించిన నర్సరీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు హామీ ఇచ్చినట్లు సంఘ నేతలు తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, రెవరెండ్ ఫాదర్ సతీష్ బాబు

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

● నగరంలో కొవ్వొత్తులతో భారీ నిరసన ర్యాలీ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యఘటనలో మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని సెయింట్ మాథ్యూస్ వెస్ట్ ప్యారిస్ చర్చి రెవరెండ్ పాస్టర్ సతీష్‌బాబు డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనను ఖండిస్తూ సోమవారం సెయింట్ మాథ్యూస్ వెస్ట్ ప్యారీస్ చర్చినుంచి హిందూకళాశాల కూడలివరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ 78 ఏళ్ల స్వతంత్ర్య భారతంలో ఇలాంటి ఘటనలు సిగ్గుచేటన్నారు. ప్రతి ఒక్కరూ స్పందించి దోషులను కఠినంగా శిక్షించే వరకు నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని సహించం



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న శ్రామికనగర్ వాసులు

● అధికారులతో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 140 అర్జీలు
● పరిష్కరించాలంటూ ఆదేశాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19: అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ హెచ్చరించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 140 అర్జీలు వచ్చాయి. జేసీ ఏ.భార్గవ్‌తేజ, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాధ్, ఆర్డీవో పీ.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాధ్‌తో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీవో శేషశ్రీ, జిల్లా ఉపాధి అధికారి రఘు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, డీటీసీ కరీం, ఎల్‌డీఎం మహీపాల్ రెడ్డి, డీఈవో శైలజ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు.. వినతులు

గుంటూరు రూరల్, లాలుపురం పంచాయితీ పరిధిలో పేదలు ఏర్పాటు చేసుకున్న శ్రామికనగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు అర్జీ అందజేశారు. తాము ఆప్రాంతంలో 12 ఏళ్లగా ఉంటున్నామని, కనీసం సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులకు అనేక మార్లు వినతిపత్రాలు అందజేసినా స్పదించలేదని వాపోయారు. కాలనీకి రోడ్లు, డ్రెయినేజీ, మరుగుదొడ్లు, జోరు నెంబర్లు, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, వీ.విజయ, కృష్ణవేణీ, చంటమ్మ, జీ.పద్మ, కే.భూలక్ష్మీ, నాగుర్‌బీ తదితరులు ఉన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతో విధులునుంచి తొలగిస్తున్నారని మేడికొండూరుకు చెందిన వెలుగు యానిమేటర్లు అర్జీ అందజేశారు. సెప్టెంబరు 1 నుంచి విధుల్లోకి రావద్దని నోటీసులు పంపారని, కనీసం కారణం కూడా చెప్పడం లేదని వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారిలో మల్లీశ్వరీ, హసీనా, షకీలా తదితరులు ఉన్నారు.

పూర్వీకుల నుంచి వస్తున్న స్థలాన్ని అక్రమించుకున్నారని ఫిరంగిపురం మండలం, అమీనాబాద్‌కు చెందిన అన్నవరపు వెంకటేశ్వరరావు అర్జీ అందజేశారు. గ్రామంలో ఉన్న గ్రామ కంఠకం సర్వే నెం 392లో మూడన్నర సెంట్ల స్థలం ఉందని, దానికి మాకు కేటాయిస్తున్నట్టు గ్రామపెద్దలు తీర్మానం చేశారన్నారు. ఈమధ్యనే స్థలాన్ని అక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, ఉన్నాతాధికారులు స్పందించి ఆ స్థలాన్ని తమకు ఇప్పించాలని కోరారు.

శారీరక లోపాన్ని నిర్ధయించడం లేదని స్థానిక రామిరెడ్డితోటకు చెందిన విభిన్న ప్రతిభావంతుడు షేక్ మహమద్ రసూల్ అర్జీ అందజేశారు. పుట్టకతో పోలియో వచ్చిందని, కానీ వైద్యులు ధ్రువీకరించడంలేదని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

స్థానిక ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి విస్తరణ పనులను పూర్తి చేయాలని వైసీపీ నేత, ఎస్.నరసింహారావు అర్జీ అందజేశారు. విస్తరణ పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టరుకి వివరించారు.

దివ్యాంగుడికి యూబీఐ ఆర్థికసాయం

తెనాలి, ఐతానగర్ 1వ వార్డులో నివాసం ఉంటున్న దివ్యాంగుడు ముద్రకోలా మల్లికార్జుననాయుడుకు ఆర్థికపరిస్థితి మెరుగుపర్చుకునేందుకు రూ.50 వేల చెక్కును సోమవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అందించారు. మల్లికార్జున నాయుడు భార్య కూడా దివ్యాంగురాలు కావడంతో తమకు ఎటువంటి జీవనాధారం లేదని, కుటుంబ పోషణకు సైతం ఇబ్బంది పడుతున్నామని, ఆర్థికసాయం అందించాలని గత నెల 19వ తేదీన దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం స్పందించింది. స్టీల్ సామానుల కొట్టు పెట్టుకోవడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా అర్హతమేరకు రూ.50వేల చెక్కును కలెక్టర్ అందజేశారు.

సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

● నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు
● పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ



వాహనాల షెడ్డులో తనిఖీ నిర్వహిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 19 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇస్తున్న అర్జీలను క్షేత్ర స్థాయి అధికారులు నేరుగా పరిశీలించి, చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు 35 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 9, ఇంజినీరింగ్ 15, రెవెన్యూ 2, ప్రజారోగ్యం 1, అకౌంట్స్ 4, ఉపా సెల్‌కి సంబంధించి 4 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేరాజ్యలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, వెంకట లక్ష్మీ, ఎస్ఈ శ్యాం సుందర్, సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ ప్రసాద్, ఉపాసెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఈఈలు, ఆర్‌వోలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

వాహనాల నిర్వహణ పక్కాగా ఉండాలి

గుంటూరు నగరపాలక సంస్థ వాహనాల షెడ్డులో వాహనాల నిర్వహణ పక్కాగా ఉండాలని, మరమ్మతులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ కేవీపీ కాలనీలోని వెహికిల్ షెడ్‌ని ఆకస్మిక తనిఖీ చేసి, షెడ్‌లోని వాహనాలు పరిశీలించి, రిజిస్టర్‌లను తనిఖీచేశారు. కమిషనర్‌తో పాటు డీఈఈ సతీష్, ఏఈ రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నం ఉన్నారు.

15 రోజుల్లో మెరుగైన పారిశుధ్యాన్ని అందించాలి

ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్యం అధిక ప్రాధాన్యం కలిగిన అంశమని, శానిటేషన్ విధుల్లోని అధికారులు, కార్మికులు సమన్వయంతో కృషిచేస్తూ 15 రోజుల్లో మెరుగైన పారిశుధ్యాన్ని నగరానికి అందించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్‌హాల్లో ప్రజారోగ్య విభాగానికి సంబంధించి శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులతో నగరంలో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. రానున్న 15 రోజుల్లో నగరంలో మెరుగైన పారిశుధ్యాన్ని సాధించాలని, ప్రతి రోజు ఉదయం 5:30 గంటల నుండి నగరంలో ఆకస్మిక తనిఖీలకు వస్తామన్నారు. పారిశుధ్య విభాగానికి సంబందించిన మేస్త్రీలు టాస్క్‌ఫోర్స్ వంటి ఇతర విధుల్లో ఉండడానికి వీల్లేదని, మంగళవారం నుంచి వారికి సంబదించిన వార్డుల్లో విధుల్లో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డి.వెంకటల్ లక్ష్మీ, శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, ఆనందకుమార్, ఆయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు కమిషనర్ రూ.25 వేలు విరాళం

అన్నక్యాంటీన్ నిర్వహణకు తన వంతుగా రూ.25 వేలు విరాళంగా అందజేస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అన్నక్యాంటీన్లకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా కోరారు. అలాగే నగరపాలక సంస్థ ఉద్యోగుల ద్వారా అందే విరాళాలను చెక్ రూపంలో ప్రభుత్వం నిర్దేశిత బ్యాంకు అకౌంట్‌కి జమ చేస్తామని, దాతల వివరాలను ప్రభుత్వంకు లేఖ ద్వారా పంపుతామని కమిషనర్ తెలిపారు.

ఫుట్‌బాల్ ఎంపికలకు విశేష స్పందన

గుంటూరు(తూర్పు),ఆగస్టు 19:ఫుట్‌బాల్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో పేరేచర్ల మైదానంలో సబ్ జూనియర్ బాలుర విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపికలకు విశేష స్పందన లభించింది. పలు పాఠశాలలకు చెందిన 93 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23, 24, 25 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్, సంఘ జిల్లా కార్యదర్శి దుర్గా మోహన్, కోచ్ బ్రహ్మం తెలిపారు.

23 నుంచి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19: స్థానిక హిందు కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక ఏస్టీఆర్ క్రీడామైదనంలో ఈనెల 23 నుంచి మూడురోజులపాటు పురుషులు, మహిళల విభాగాల్లో హిందూ కళాశాల మాజీ పీడీ పసుపులేటి యడ్ల రాజ్యలక్ష్మీ స్మారక బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు టీ.వెంకటేష్, ఎమ్‌వీఎస్ మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో 12 పురుషులు, 6 మహిళల జట్లు పాల్గొనన్నుట్లు తెలిపారు. ప్రతి విభాగంలో మూడు జట్లను విజేతలుగా ప్రకటిస్తామన్నారు.

సుమేధాలో రక్షాబంధన్ వేడుకలు

గుంటూరు(విద్య),ఆగస్టు 19: స్థానిక ఎన్జీవో కాలనీలోని సుమేధా స్కూల్లో సోమవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు రాకీలు కట్టి వేడుకల్లో పాల్గొన్నారని డైరెకర్ ఎం.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ప్రతి అక్కాచెల్లి తమ అన్న తమ్ముడి క్షేమాన్ని కోరుతూ తమ జీవితాంతం రక్షగా ఉంటారనే నమ్మకంతో రాఖీ కడతారని వెల్లడించారు. భారతీయ సంస్కృతిలో ఇదో గొప్ప సంప్రదాయమని ఆయన వివరించారు.



చుక్కపల్లి రమేష్‌కు చెక్కును అందజేస్తున్న దాతలు

భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5: జేకేసీ రోడ్డులోని కమ్మజనసేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని రూ.6 లక్షల విరాళాన్ని మాదినేని జ్యోతి, మల్లవరపు క్రాంతి, శ్యామ్, సాయిబాబు, మాదినేని ప్రశాంతి ప్రకటించారు. సోమవారం కేజేఎస్ఎస్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌కు చెక్కును అందజేశారు. ఈసందర్భంగా దాతలు మాట్లాడుతూ మాదినేని పాపారావు జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేసినట్టు వివరించారు. చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రముఖ బిల్డర్ గద్దె తిరుపతిరావు చొరవతో ఈ విరాళాన్ని అందజేసారని అన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఆగస్టు 19: విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా డీ7 సెక్షన్ పరిధిలోని గోరంట్ల, మల్లికార్జునపురం, టీచర్స్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, అన్నపూర్ణనగర్, అగతవరపాడు, బాష్యం టైటానిక్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ టీ.సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం


గుంటూరు(తూర్పు), ఆగస్టు 19: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం శ్రావణపౌర్ణమి సందర్భంగా విశ్వ శాంతిని కాంక్షిస్తూ చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జెండాల ఆవిష్కరణ

గుంటూరు, ఆగస్టు 19: గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాతగుంటూరు బాలాజీ నగర్, సంగడిగుంటలో భారతీయ జనతా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో బీజేపీ ముందుకు వెడుతున్నట్లు తెలిపారు. అన్ని మండలాల్లో బీజేపీ జెండా దిమ్మెలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా సోమవారం 4వ మండల అధ్యక్షుడు బొడబత్తుల రామకృష్ణ, 8వ మండల అధ్యక్షుడు ఎర్ర శ్రీనివాసరావు పార్టీ జెండా దిమ్మెలను ప్రారంభించినట్లు తెలిపారు.

గ్రామ సభలను విజయవంతం చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మీ



జిల్లా అధికారులతో వీసీ నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ

గుంటూరుసిటీ, ఆగస్టు 19: ఆగస్టు 23 నుంచి జరిగే గ్రామసభలను విజయ వంతం చేయడానికి ఎంపీడీవోలు, ప్రోగ్రాంఆఫీసర్లు, మండల,జిల్లా ప్రత్యేకాధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఎస్.నాగ లక్ష్మీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి ఆమె జేసీ భార్గవ్‌తేజ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్‌తో కలసి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపై సబ్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, వ్యవసాయ, ఉద్యాన, హౌసింగ్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభల నిర్వహణ సమాచారాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరికి తెలియజేయ లన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు గ్రామ సభల్లో పాల్గొనాలని, సభలు విజయ వంతం కావడానికి ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని, సంబంధిత రికార్డులు అందుబాటులో వుంచాలని ఆదేశించారు.

రెడ్ రన్ విజేతలకు బహుమతులు .. రెడ్ రన్ విజేతలకు కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ భార్గవ్ తేజ సోమవారం నగదు బహుమతులు అందజేశారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 8 ,10వ తేదీలలో నేషనల్ యూత్ ఫెస్టివల్ 2024లో భాగంగా జిల్లాస్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్, రెడ్ రన్ (మారథాన్) పోటీలు జరిగాయి. ఆయా పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.



విభిన్న ప్రతిభావంతురాలితో సీనియర్ సివిల్ జడ్జి టీ.లీలావతి

విభిన్న ప్రతిభావంతులు దేనిలోనూ తీసి పోరు

● జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

గుంటూరు, ఆగస్టు 19: విభిన్న ప్రతిభావంతులు దేనిలోనూ తీసి పోరని అన్నిరంగాల్లో ప్రతిభ కలిగి ఉన్నారని జిల్లా న్యాయసేవాధికారిసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టీ.లీలావతి అన్నారు. సోమవారం గుంటూరువారి తోటలోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో విభిన్న ప్రతిభావంతుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగవైకల్యం రాకుండా నిరోధించడం, చిన్న వయసులో గుర్తించడం ద్వారా తగిన చర్యలు తీసుకోవచ్చని జడ్జి లీలావతి తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు విద్య, వృత్తిపర శిక్షణ, పునరావాసం, సాంఘికంగా కలిసి పోయేలా చేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలు పాఠశాలకు వచ్చినందుకు ట్రాన్స్పోర్ట్, ఎస్కార్ట్ అందజేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు శ్రీధర్, భారతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎస్పీ సతీష్‌కుమార్‌ను అభినందిస్తున్న ఏపీ రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం నాయకులు కాళహస్తి సత్యనారాయణ తదితరులు

ఎస్పీ సతీష్ కుమార్‌కు అభినందనలు

గుంటూరు, ఆగస్టు 19: ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సతీష్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు. పోలీస్ కార్యాలయంలోని చాంబర్‌ను ఎస్పీని కలిసిన నాయకులు శాలువా, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీలు కేవీ నారాయణ, బీవీ సుబ్బారెడ్డి, పలువురు కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

గుంటూరు, ఆగస్టు 19: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్ కార్యక్రమానికి వినతులు వెల్లువలా వచ్చాయి. పలువురు బాధితులు ఎస్పీకి కలిసి వారి సమస్యలను విన్నవించారు.

ఇల్లు వదిలి వెళ్లకపోతే చంపుతామని బెదిరిస్తున్నారు

భర్త చనిపోవడంతో నన్ను నా పిల్లలను ఇల్లు వదిలి వెళ్లిపోకుంటే చంపేస్తామని అత్త బెదిరిసుందని పేరేచర్లకు చెందిన షేక్ సిరిపురం దరియాబి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనకు 2005లో షేక్ జానీ బాషతో వివాహమైందని, తమకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం ఉన్నారని దరియాబి తెలిపారు. అయితే 2022లో తన భర్త మృతి చెందాడన్నారు. ఏడాది కాలం సక్రమంగానే ఉన్నారని గత కొంతకాలంగా తనను, పిల్లను ఇల్లు వదిలి బయటకు వెళ్లి పోవాలని వేధిస్తున్నారని బాధితురాలు దరియాబి ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వాపోయారు.

తనకు, కుమార్తెలకు మాన,ప్రాణాలకు రక్షణ కల్పించండి

తమ ఇంటిలో అద్దెకు ఉంటూ గంజాయి విక్రయించడమే కాకుండా నిత్యం సేవిస్తూ తనను తన కుమార్తెలను బెదిరిస్తున్న బండారు పద్మ కుమారుడైన యేసు అలియాస్ ప్రభు నుంచి తమకు ప్రాణ,మాన రక్షణ కల్పించాలని యతిరాజులనగర్ 11వ లైనుకు చెందిన ఓ మహిళ ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఆయన నుంచి తమకు తగిన రక్షణ కల్పించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేశారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులు ఒక్కొక్కరి వద్ద మూడు, నాలుగు లక్షలు వసూలు చేసి ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న లక్షల రూపాయలు డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన మధిర అనిల్ కుమార్ అనే వ్యకిని వెంటనే అరెస్ట్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీసీ, ప్రజాసంఘాల నేతలు విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు సోమవారం జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు కలెక్టర్, ఎస్పీలను కలసి వినతి పత్రం అందించారు. తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్పీ గ్రివెన్స్ లలో మోసపోయిన బాధితులు మొరపెట్టుకున్నారు.

రిజిస్ట్రేషన్ సర్ చార్జీ విడుదల చేయాలి

గుంటూరు సిటీ, ఆగస్టు 19 : జిల్లాలోని 277 గ్రామ పంచాయతీలకు రావాల్సిన వృత్తి పన్ను, రిజిస్ట్రేషన్ సర్ చార్జీ, 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మీని కలిసి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలలో నిధులు లేక నీటి సరఫరాకు, బ్లీచింగ్, పారిశుధ్య కార్మికులకు జీతాలు, విద్యుత్ బకాయిలు, గ్రీన్ అంబాసిడర్ల జీతాలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు వివరించానని చెప్పారు.

సంస్కృతభాషపై పట్టుసాధించాలి

గుంటూరు(విద్య),ఆగస్టు 19: విద్యార్థినులు సంస్కృత భాషపై పట్టు సాధించాలని శారదానికేతన్ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బ్రాడీపేటలోని పాఠశాలలో నిర్వహించిన సంస్కృత భాషా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్కృత భాష అన్ని భారతీయభాషలకు మూలమని తెలిపారు. సంస్కృతి, సంప్రదయాల్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉంద న్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు సంస్కృత భాషాభివృద్ధికి కృషిచేశారని వెల్లడించారు. కార్యక్రమంలో ఓరియంటల్‌కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఆర్ దేవయ్య, హెచ్ఎం ఎస్ ఉషా కుమారి తదితరుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.



కమిషనర్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న జనసేన నేతలు

కమిషనర్‌ను కలిసిన జనసేన నేతలు

గుంటూరు సిటీ, ఆగస్టు 19 : గుంటూరు మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పులి శ్రీనివాసులును జనసేన నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన రాష్ట్ర నేత బోనయినశ్రీనివాస యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లుతదితరులు కమిషనర్ ను కలిసి నగర పరిస్థితి పై కొద్దేసపు ముచ్చటించారు. ప్రజలకు సత్వర పౌర సేవలు అందేలా చూడాలని కోరారు.నగర అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాలని, కూటమి తరపున తమ సహకారం పూర్తిగా ఉంటుందని జనసేన నేత లు అన్నారు.

దిక్సూచి DIKSUCHI



భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- **భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లిం గ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.

వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.

ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29

ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

(నిన్నటి దిక్సూచి తరువాయి)

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబి కులాలను వర్గీకరించి వారికి విద్య, ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీం కోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి.చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువమంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6:1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాం గ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమీలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

బంతి రాష్ట్రప్రభుత్వాల కోర్టులో

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నా యి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బ తీయడం తప్ప పెద్దగా ఒన గూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమ సమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jse4ruCలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్



కుర్రోళ్ల కష్టం కనిపించింది

నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకున్న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని చూసిన మెగాస్టార్ చిరంజీవి ఆ సినిమా టీమ్‌ను తన ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. నిహారిక, దర్శకుడు యదు వంశీ తదితరులు ఆయన్ని కలిశారు. 'సినిమా చాలా చక్కగా ఉంది. కొత్త వాళ్లు నటిస్తున్నారనే విషయాన్ని సినిమా చూస్తున్నంతసేపూ మరిచిపోయా. చిత్రీకరణ చాలా సహజంగా ఉంది. ఎంటైర్ యూనిట్ పడిన కష్టం తెరపై కనిపించింది. రీజనబుల్ బడ్జెట్‌లో సినిమా తీసిన దర్శకుడు యదు వంశీకి అభినందనలు' అని ప్రశంసించారు చిరంజీవి.



బ్రహ్మా ఆనందం సందడి

హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న 'బ్రహ్మా ఆనందం' చిత్రం గ్లింప్స్‌ను రాఖీ పండగ సందర్భంగా సోమవారం విడుదల చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్, వెన్నెల కిశోర్ .. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథతో వినోదాల విందు వడ్డించడానికి కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ సిద్ధమవుతున్నారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

కన్నప్ప కోసం కంపడు.. గవ్వ రాజు



విష్ణు మంచు నటిస్తూ, ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న నటులకు సంబంధించిన లుక్స్ ఒక్కొక్కటి విడుదల చేస్తున్నారు. ఇందులో కంపడు పాత్ర పోషిస్తున్న ముఖేశ్ రిషి, గవ్వరాజు పాత్ర చేసిన బ్రహ్మాజీ లుక్స్ సోమవారం రిలీజ్ చేశారు. పురాతన పుళింద జాతికి చెందిన అత్యంత భయంకరమైన తెగకు సంబంధించిన పాత్రలు ఇవి. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ దర్శకుడు.

అమ్మాయిలకు ఆమడ దూరం



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. అమ్మాయిలంటే ఆమడదూరంలో ఉండే హీరో పాత్రను హిలేరియస్‌గా పరిచయం చేసింది ఈ ట్రైలర్. అలాగే టీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలు కూడా వినోదభరితంగా ఉంటాయని దర్శకుడు జె.శివసాయి చెప్పారు. వినాయకచవితి సందర్భంగా సెప్టెంబర్ 7న సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఎన్వీ కుమార్ చెప్పారు.

రిలీజ్ డేట్ ఖరారు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ పదిన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణసంస్థ లైకా ప్రొడక్షన్స్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. సామాజికపరమైన సమస్యలు తీసుకుని ఆకట్టుకొనేవిధంగా చిత్రాలు తీసే దర్శకుడు టీజె జ్ఞానవేల్ రూపొందించిన తాజా చిత్రం ఇది. లైకా సంస్థ రజనీకాంత్‌తో నిర్మిస్తున్న ఈ నాలుగో చిత్రంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది అమితాబ్, రజనీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమా కావడం మరో విశేషం. అలాగే రజనీకాంత్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ కలసి పని చేస్తున్న చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం. వేట్టైయాన్' చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



కూర్గ్‌లో పెళ్లి

'రాజావారు..రాణీగారు' చిత్రంలో హీరోహీరోయిన్లుగా నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్‌ల వివాహం ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలోని కూర్గ్‌లో జరుగుతుంది. రహస్య బంధువులంతా కూర్గ్‌లో ఉండడంతో అక్కడే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సన్నిహితులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో ఈ పెళ్లి జరుగుతుంది. దాదాపు ఐదేళ్ల నుంచి ప్రేమలో ఉన్న కిరణ్, రహస్య ఈ ఏడాదే తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ : కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క' నుంచి ఫస్ట్ సింగిల్ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్'ను సోమవారం విడుదల చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. దర్శకద్వయం సుజిత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న 'క' చిత్రాన్ని త్వరలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి విడుదల చేయనున్నారు.

సందేశంతో 'జనక అయితే గనక'



సుహాస్, సంగీర్తన జంటగా నటిస్తున్న చిత్రం 'జనక అయితే గనక'. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. కథానాయకుడు సుహాస్ పుట్టినరోజు సందర్భంగా.. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'నా ఫేవరెట్ నా పెళ్ళాం"ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ "ఇది చాలా మంచి సందేశంతో నిండిన కథ. పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్య తరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. చాలా రోజుల తర్వాత ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తి ఈ సినిమాతో కలుగుతుంది" అని చెప్పారు. "ఇది నా జీవితంలో మరిచిపోలేని సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. ఈ పాటకు విజయ్ బుల్గానిన్ వినసొంపైన సంగీతాన్ని.. కృష్ణకాంత్ ఆకట్టుకునే సాహిత్యాన్ని ఇచ్చారు" అని సుహాస్ అన్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది.



ఒకే రోజు.. రెండు చిత్రాలు!

సాధారణంగా ఒక హీరో నటించిన రెండు సినిమాలు, ఒక దర్శకుడు తెరకెక్కించిన రెండు సినిమాలూ ఒకే రోజు విడుదలైన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు రష్మిక మందన్న విషయంలో ఆలాంటి పరిస్థితే రిపీట్ అవుతోంది. ఆమె కథానాయిక పాత్రను పోషిస్తున్న 'పుష్ప 2' సినిమా డిసెంబరు 6న విడుదల అవుతోన్న సంగతి తెలిసిందే. అలాగే అదే రోజున రష్మిక నటిస్తున్న మరో చిత్రం 'ఛావా' కూడా విడుదలవుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోందీ చిత్రం. 'పుష్ప' చిత్రం ఉత్తరాదిలో కూడా పెద్ద హిట్ కావడంతో 'పుష్ప2' కోసం అక్కడి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా విడుదలయ్యే రోజే 'ఛావా' చిత్రం కూడా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. నిజంగానే ఈ పోటీ ఉంటుందా లేక 'ఛావా' వెనక్కి వెళుతుందా అనేది వేచి చూడాలి

'రాఖీ' స్పెషల్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ అందరికీ ప్రత్యేకమయితే.. సినిమా తారలకి మరింత ప్రత్యేకం. ఈ ఏడాది కొందరు తారలు వారి సోదరులతో తీసుకున్న ఫొటోలను.. మరి కొందరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ త్రోబ్యాక్ పిక్స్‌ను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలను చూసిన అభిమానులు 'బ్రదర్ సిస్టర్ బాండింగ్' అంటే ఇదేనంటూ తెగ మురిసిపోతున్నారు.



అందరికీ పేరుపేరునా..

"అందరికీ పేరుపేరునా 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు" అని హీరో వరుణ్ తేజ్ తన సోదరీమణులు నిహారిక, సుష్మితతో కలసి తీసుకున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



నా మార్గదర్శకురాలికి..

అక్కా.. 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు. నా మార్గదర్శకురాలిగా.. సపోర్ట్ సిస్టమ్‌గా ఉన్నందుకు కృతజ్ఞతలు" అని హీరో సుధీర్‌బాబు తన సోదరితో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.

'హ్యాపీ రక్షా బంధన్'

"నా ప్రియ సోదరి మౌని కుట్టీకి.. నన్ను సొంత తోబుట్టువులా భావించే అభిమానులందరికీ 'హ్యాపీ రక్షా బంధన్' అని హీరో సందీప్ కిషన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.





"ఒకరినొకరు ఎల్లప్పుడూ ఇలాగే కాపాడుకుంటూ ఉండాలి" అంటూ తన సోదరుడికి రాఖీని కడుతూ నభా నటేశ్ ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు.

ఇష్టమైన సమయం వచ్చేసింది



"ప్రతీ ఏడాది.. ఈ రోజు ఎంతో ప్రత్యేకం.. మరెంతో ఇష్టం. ఎందుకంటే ఈ రోజు నువ్వు నా కోసం నచ్చిన బహుమతులు తెస్తావు.. నన్ను కాపాడుతానని ప్రేమతో వాగ్దానాలు చేస్తావు.. నేను చెప్పే ప్రతీది వింటావు" అని రకుల్‌ప్రీత్ సింగ్ తన సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్‌కు రాఖీ కడుతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



థ్యాంక్యూ అన్నయ్యా..

"థాంక్యూ అన్నయ్యా.. నా బిగ్ బ్రదర్‌గా ఉన్నందుకు" అని మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని, తన సోదరుడు గౌతమ్‌తో దిగిన చిన్ననాటి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

నిన్ను బాగా మిస్సవుతున్నాను



"నా బెస్ట్ బ్రదర్‌కి 'హ్యాపీ రక్షా బంధన్'. మనం చిన్నప్పుడు కలసి చేసిన అల్లరినీ.. నిన్నూ ఎంతో మిస్సవుతున్నాను. త్వరలోనే కలుద్దాం" అని హీరోయిన్ తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు.

వీరితో పాటు అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్, సోనూసూద్, సన్నీ డియోల్, కంగనా రనౌత్, పరిణీతీ చోప్రా, భూమి పడ్నేకర్, మనీషా కోయిరాల, రియా చక్రవర్తి, హ్యూమా ఖురేషీ, సారాఅలీ ఖాన్, జెనీలియా దేశ్‌ముఖ్, సోనమ్ కపూర్, కూడా రాఖీ పౌర్ణిమను సెలబ్రేట్ చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

అమాయకత్వం..తింగరితనం...



బాలనటిగా వెండితెరపై అడుగుపెట్టి.. పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు రమ్య పసుపులేటి. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ నటించిన ఈ చిత్రాన్ని లక్ష్మణ్ కార్య తెరకెక్కించారు. ఈ నెల 23న సినిమా విడుదలవుతున్న సందర్భంగా రమ్య మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. అమాయకత్వం, తింగరితనం కలగలిపిన పాత్ర నాది. నా పాత్ర ద్వారా అందరూ హాయిగా నవ్వుకుంటారు. దర్శకుడు లక్ష్మణ్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. అంకిత్ కొయ్య కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి. సెట్స్‌లో రావు రమేశ్, ఇంద్రజ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని చెప్పారు.

'తల్వార్' ఆకాశ్ జగన్నాథ్



దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ జగన్నాథ్ కొత్త చిత్రం 'తల్వార్' షూటింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. కొత్త దర్శకుడు కాశీ పరశురామ్‌ని పరిచయం చేస్తూ భాస్కర్ ఇ.ఎల్.వి. నిర్మిస్తున్నారు. ఆకాశ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు దర్శకుడు బాబీ కెమెరా స్విచాన్ చేయగా, రచయిత విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు సానా బుచ్చిబాబు తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు.

కశ్మీర్‌కు 'ఎనిమిది వసంతాలు'



'మ్యాడ్' చిత్రంలో నటించి గుర్తింపు పొందిన అవంతిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. భారీ చిత్రాలనే కాదు కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులకు ఆశయంతో వారు ఈ సినిమా తీస్తున్నారు. 'ఎనిమిది వసంతాలు' చిత్రం తదుపరి షెడ్యూల్ కశ్మీర్, ఆగ్రా, వారణాసి ప్రాంతాల్లో జరుగుతుంది.

సెలబ్రిటీ నీకన్న ఎవడురా



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్(గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్). దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ స్టేజ్‌లో ఉన్న ఈ చిత్రం నుంచి హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌ను విడుదల చేశారు. 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్న ఎవడురా' అంటూ కాసర్ల శ్యామ్ రాసిన పాట ఇది. 'పుష్ప 2'లో టైటిల్ సాంగ్ పాడిన దీపక్ బ్లూ ఈ పాట పాడడం విశేషం. 'ఇప్పటివరకూ ఎనభై శాతం చిత్రం పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్ రెండు పాటలు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలో చిత్రీకరిస్తాం' అని నిర్మాత చెప్పారు.



హీరో కృష్ణ అభిమాని సినిమా

కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న 'జ్యూవెల్ థీఫ్' చిత్రం టీజర్ నటుడు పృథ్వీ విడుదల చేశారు. 'నేను హీరో కృష్ణగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చా. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్' అని చెప్పారు కృష్ణసాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత మల్లెల ప్రభాకర్ చెప్పారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మహిళ రైతులు

కృష్ణా పశ్చిమ డెల్టాకు నీటి విడుదల పెంచాలి

తెనాలి అర్బన్, ఆగస్టు 19: కృష్ణా పశ్చిమ డెల్టాకు నీటి విడుదల పెంచాలని రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు సమస్యలు వివరించారు. పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌కు నిధులు కేటాయించి 26వేల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. మహిళా పాడి రైతులకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. 2023-24లో తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఇంకా కొందరికి పరిహారం అందలేదని చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా గ్రూపులకు కూడా రుణ పరపతి పెంచి మహిళలకు తోడ్పడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ములకా శివ సాంబిరెడ్డి, వేజండ్ల సబిత తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేయడానికి కలెక్టరేట్‌కు వచ్చిన కొలకలూరు గ్రామస్థులు

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తెనాలి రూరల్, ఆగస్టు 19: తెనాలి మండలం కొలకలూరు గ్రామ పంచాయతీ నిధులను గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి దుర్వినియోగం చేశారంటూ ఆ గ్రామ జనసేన నాయకులు తోట నాగేంద్రబాబు పలువురు గ్రామస్థులతో కలిసి గుంటూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచ్ ప్రీతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు ఇచ్చే నిధుల్లో భారీగా అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. గత సంవత్సరంలో ఇదే విషయంపై స్పందనలో అర్జీ అందించగా అధికారులు విచారణ జరిపి కేవలం ఒక్క సంవత్సరంలోనే దాదాపుగా రూ.95లక్షలకు పైగా అవకతవకలు జరిగినట్లు తేల్చారన్నారు. అదే సమయంలో సర్పంచ్ చెక్‌పవర్‌ను సైతం రద్దుచేశారన్నారు. అనంతరం 2023 జూలైలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలని కోరగా ఆగస్టు నెలలో డీఎల్‌పీవో స్వరూపరాణి విచారణ చేశారని, నెల రోజుల్లో నివేదిక ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. చెక్కుపవర్ రద్దుచేసినప్పటికి నగదు లావాదేవీలు నిర్వహించారని ఆరోపించారు. చొప్పర ప్రీతి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నేటి వరకు పంచాయతీ ఆదాయ, వ్యయాలపై విచారణ జరిపించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.భాస్కరరావు, ఎంవీ రాఘవయ్య, కే శ్రీనివాసరావు, వైవీ సత్యనారాయణ, రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు

తెనాలి రూరల్, ఆగస్టు 19: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అందులో 2 సర్వేకిరాగా, మరో 2 మ్యుటేషన్‌కు, మిగిలిన రెండు స్థలాలు చూపించాలంటూ అందినట్లు వెల్లడించారు. తెలిపిన ప్రతి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

ప్రజావేదికకు ఏడు దరఖాస్తులు

తెనాలి అర్బన్, ఆగస్టు 19: సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు విజ్ఞప్తులు అందాయని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. రెవెన్యూ 1, మున్సిపల్ 4, సబ్ రిజిస్టర్ 1, పోలీసు శాఖకు సంబంధించి 1 దరఖాస్తు అందినట్లు తెలిపారు.

హకీంజానీకి యువ కళావాహిని పురస్కారం

తెనాలి అర్బన్, ఆగస్టు 19: సాహిత్యవేత్త హకీంజానీకి యువ కళావాహిని సంస్థ పురస్కారం ప్రకటించింది. గుంటూరు బృందావన గార్డెన్స్‌లో ఈ నెల 23న హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాల్గొనే కార్యక్రమంలో తెలుగు వెలుగుల పురస్కారం ప్రదానం చేస్తారు. బాల సాహిత్యం, వ్యాసాలు, కథలు రచించిన జాని సాహిత్య సేవను సంస్థ గుర్తించింది. ఈ నెల 23న జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోవాలని సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అందించిన పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

ఘనంగా విఖానస జయంతి

తెనాలి అర్బన్, ఆగస్టు 19: అన్ని శాస్త్రాలలో వైఖానస ఆగమం శ్రేష్టమైనదని టీటీడీ ఆగమ పండితులు, వేద విజ్ఞాన పీఠం అధ్యాపకుడు దీవి ఫణికుమార్ చెప్పారు. వైఖానస సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం విఖానస జయంతి నిర్వహించారు. గోవర్ధనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మేడూరి శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, నైమిశరణ్యంలో మహావిష్ణువు విఖనస మునిగా ఉద్భవించారని చెప్పారు. 18 రకాల ఆగమ ప్రక్రియలను వివరించారు. అనంతరం విఖనస స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో ఫణికుమార్‌కు ప్రజ్ఞ శారద బిరుదుతో సత్కరించారు. లక్ష్మీనరసింహాచార్యులు, మాధవకుమార్, రఘు, వేణుగోపాల్, ఈవో మల్లేశ్వరి, కిరణ్‌కుమార్, శేషసాయి పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న అర్చకబృందం

21న భారత్ బంద్

తెనాలి అర్బన్, ఆగస్టు 19: ఎస్సీ వర్గీకరణకు నిరసనగా ఈ నెల 21న భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తెలిపారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ చేపట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 21న జరిగే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు కనపర్తి అనీల్ కోరారు. సోమవారం వేదిక్ కార్యాలయంలో బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామన్నారు. వర్గీకరణ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు రివ్యూ చేయాలని కోరారు. అన్ని వర్గాలు బంద్‌కు సహకరించాలన్నారు. బండ్లమూడి నాని, అబ్రహంలింకన్, అక్కిదాసు కిరణ్, దారా రామకృష్ణ, స్టాలిన్, రాజారత్నం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తోటలో విద్యార్థుల నిరసన ర్యాలీ

కొల్లిపర, ఆగస్టు 19: మండల పరిధిలోని అత్తోట హైస్కూల్ విద్యార్థులు కోలకత్తాలో డాక్టర్ హత్యతకు నిరసనగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి సంతాపం వ్యక్తంచేసి విద్యార్థులు మౌనం పాటించారు. నల్లబ్యాడ్జీలు ధరించి విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ డాక్టర్‌పై హత్యకు పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలన్నారు దోషులపై కఠినమైన చట్టాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు ఎర్రబడుతున్న వరిపైర్లు

● జిల్లా వ్యాప్తంగా 36,000 హెక్టార్లలో వరిసాగు
● పంటలను పరిశీలించిన ఏరువాక శాస్త్రవేతలు
● సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటూ సూచనలు



వరిపైర్లను పరిశీలిస్తున్న డాక్టర్‌నగేష్, శాస్త్రవేత్త వెంకటలక్ష్మి తదితరులు

తెనాలి రూరల్, ఆగస్టు 19: పెరుగుతున్న ఎండలకు వరిపైర్లు అక్కడక్కడ ఎర్రబడుతున్నాయని అటువంటిపైర్లు ఉన్న రైతులు తప్పనిసరిగా తాము చేసే సూచనలు పాటించాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్, సీనియర్ శాస్త్రవేత్త వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని సోమసుందరపాలెం గ్రామంలోని వరిపైర్లను మండల వ్యవసాయాధికారి ప్రేమసాగర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదిరోజుల నుంచి ఎండలు ఉధృతిపెరగడం వల్ల ఎక్కడైతే చౌడు భూముల్లో వరిసాగు చేస్తున్నారో ఆ పంట భూముల్లో ఎండకు నీరు ఆవిరైపోయి నేలలోని లవణాలుపై పొరలలో చేరటం వలన వరి మొక్కల్లో తేమ కోల్పోయి ఆకులు ఎర్రబడుతున్నాయన్నారు. చౌడు ఉన్న పలు ప్రాంతాల్లో ఇలా పంటలు దెబ్బతినడం గమనించడం జరిగిందన్నారు. ఆ పంట భూముల్లో సాగుచేస్తున్న రైతులు తప్పనిసరిగా నీరు నిల్వకట్టి ఉంచాలన్నారు. ఆకులు తెల్లబడినట్లైతే అన్నబేరి లీటరు నీటికి 20 గ్రాములు కలిపి 20గ్రాములు నిమ్మఉప్పుని కలుపుకోని పిచికారి చేయాలని సూచించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి జి.మోహన్, గ్రామ వ్యవసాయసహాయకులు డి. సంసోమయ్య, మరియు అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో అండర్ బ్రిడ్జి మూసివేత

● పోలీసుల నిర్ణయంతో భక్తులకు ఇక్కట్లు
● రాంగ్ రూట్‌లో వెళుతుండటంతో పెరుగుతున్న ప్రమాదాలు





పెదకాకాని శర్మ పెట్రోల్ బంక్ వద్ద, పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇరువైపులా బ్రిడ్జిని మూయించిన పోలీసులు

పెదకాకాని, ఆగస్టు 19: పెదకాకాని అంటేనే పుణ్యక్షేత్రాలకు నిలయం.. నిత్యం వేలాది మంది భక్తులు పెదకాకాని వస్తూ ....పోతూ ....ఉంటారు. ట్రాఫిక్ సమస్య ఇక్కడ సర్వసాధారణం.... ఇంతటి ప్రాచీన్యం కలిగిన పెదకాకానిలో పోలీసుల నిర్ణయంతో ట్రాఫిక్ సమస్యలు సోమవారం మరింత ఎక్కువయ్యాయి. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానానికి, కాకాని స్వస్తితశాల (తోట)కు భక్తులు పోటెత్తారు. వేలాదిమంది భక్తులు పెదకాకాని వచ్చివెళ్లారు. అయితే పోలీసులు తీసుకున్న నిర్ణయంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న అండర్ బ్రిడ్జిని తూర్పు మార్గాన్ని, శర్మ పెట్రోల్ బంక్ ఎదుట ఉన్న పడమర మార్గాన్ని మూసివేశారు. దీంతో తోటకు వచ్చిన వేలాదిమంది భక్తులు వాహనాల తో ఇబ్బందులు పడ్డారు. ఈ అండర్ పాస్‌ని మూసివేయటంతో తోటకొచ్చిన భక్తులు పెదకాకాని సెంటర్ కొచ్చి అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాల్సి వచ్చింది. కొంతమంది తోట వద్ద నుంచి వాహనాలను రాంగ్ రూట్లో వచ్చి ఆటోనగర్ వై జంక్షన్ వద్ద కలిశారు. పలు చోట్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడడంతో అనేకచోట్ల ప్రజలు పోలీసుల వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదాలను నివారించాల్సిన పోలీసులే రాంగ్ రూట్లో వాహనాలు వెళ్లేలా ట్రాఫిక్ ఆంక్షలు పెట్టడం సర్వత్రా విమర్శలకు దారితీసింది. ఈ అండర్ పాస్ కింద వెళ్లేందుకు మార్గం పెట్టి ఉంటే బాగుండేదని, రావడానికి, పోవడానికి మార్గం లేకుండా పూర్తిగా మూసివేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలి

● జలజీవన మిషన్ జిల్లా కోఆర్డినేటర్ తేజసంగీత్

పొన్నూరు టౌన్, ఆగస్టు 19: క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని జలజీవన మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ పి తేజ సంగీత్ అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరులో సోమవారం జలజీవన్ మిషన్ డీపీఎంయూ ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విస్తృత ప్రచారం జరిపారు. తేజ్‌సంగీత్ మాట్లాడుతూ భోజనం స్వీకరించటానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా డయేరియా వంటి సీజనల్ వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలన్నారు. అతిసార వ్యాధి వచ్చినప్పుడు తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. సీజనల్ వాధులపై అవగాహనపై ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్యసిబ్బంది

కాలువలో వ్యర్థాల తొలగింపు

తెనాలి రూరల్, ఆగస్టు 19: పట్టణంలోని చినరావూరు రైల్వేస్టేషన్ వద్ద నుండి ఐటీఐ కాలేజ్ రోడ్డులోని మురుగు కాలువల్లోని కల్వర్టులు, తూముల వద్ద పేరుకు పోయిన వ్యర్థాలు తొలగించరూ అన్న కథనం సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు సోమవారం మధ్యాహ్ననానికల్లా కాలువలో వ్యర్థాలను తొలగించారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన ఆంధ్రజ్యోతికి వారు ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓటరు నమోదు అధికారి హరిహరనాథ్

20 నుంచి బీఎల్వోల ఇంటింటి సర్వే

పొన్నూరు టౌన్, ఆగస్టు 19: ఈ నెల 20వ తేదీ నుంచి బూత్ లెవల్ అధికారులు ఓటరు జాబితా పరిశీలనకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి వై హరిహరనాథ్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హరిహరనాథ్ మాట్లాడుతూ అక్టోబరు 29న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనునట్లు చెప్పారు. నవంబర్ 28లోగా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన తర్వాత వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా విడుదల చేయనునట్లు వివరించారు. సమావేశంలో నియోకవర్గ ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ నియామకాలపై విచారణ జరపాలి : కాంగ్రెస్

పొన్నూరు టౌన్, ఆగస్టు 19: గత దశాబ్ధకాలంగా జరిగిన యూపీఎస్సీ నియామకాలపై విచారణ జరపాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్క రవీంద్రబాబు సోమవారం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షలపై కాషాయముద్ర పడిందని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తూ ప్రభావంతుల ఆకాంక్షలకు తిలోదకాలు ఇస్తూ గత దశాబ్దకాలంగా చేపట్టిన అన్ని పరీక్షలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దేశవాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బ్యాక్‌లాగ్ పోస్టుల బర్తీని లేటరల్ విధానంలో నియామకం చేపట్టే ప్రక్రియ తగదన్నారు. బీజేపీ పాలనలో ఓ వైపు ప్రభుత్వరంగ సంస్థల మనుగడ ప్రశ్నార్థకంగా మారగా మరోవైపు ప్రభుత్వ నియామకాల ఎంపిక అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. తమకు అనుకూలంగా ఉన్న కాషాయ మూకలను ఎంపిక చేయటానికే లేటరల్ ఎంట్రీ విధానాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ నియామకాలపై ఆర్ఎస్ఎస్ ప్రభావం ఉందన్నారు. ఇతర ఎంట్రన్స్ పరీక్షల పేపర్ల లీకులు కూడా ఉత్తరాది వారికి మేలు చేకూర్చేందుకే అని జక్క రవీంద్రనాథ్ ఆరోపించారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యపరీక్షలు

తెనాలి రూరల్ ఆగస్టు 19: పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు తెనాలి పురపాలక సంఘం కట్టుబడి ఉందని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. సోమవారం పట్టణంలోని పురపాలక సంఘ మెప్మా షెడ్‌లో అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సుమారు 110 మందికి ఈఎస్ఐ విజయవాడ వైద్యులచే వైద్యశిబిరం నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక ముఖ్యఅతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. అనంతరం ఆరోగ్యవంతమైన జీవన విధానాలపై వైద్యులు కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎస్.అభిలాదాస్, డాక్టర్ రాగదీపిక, డాక్టర్ ఎస్. వెంకటరమణదీపిక, మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



పెదరావూరు ప్రధాన రోడ్డుపై వాహనదారులను ప్రశ్నిస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు

రూరల్ పోలీసుల తనిఖీలు

తెనాలి రూరల్, ఆగస్టు 19: మండల గ్రామాల్లో రూరల్ పోలీసులు సోమవారం రాత్రి నుంచి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. తెనాలి - సంగం జాగర్లమూడి, పెదరావూరు, కొలకలూరు రోడ్లపై ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ఆపి విచారిస్తున్నారు. రోడ్డు వెంబడి పబ్లిక్ సంచరించే ప్రాంతంలో మద్యం తాగుతున్న మందుబాబులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతిరోజు పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ కోటేశ్వరరావు హెచ్చరించారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

తెనాలి క్రైం, ఆగస్టు 19: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 11వ అదనపు జిల్లా న్యాయాధికారి బి.శ్రీనివాసులు తెలిపారు. తెనాలి కోర్టు ప్రాంగణంలో జరిగే ఈ లోక్ అదాలత్‌లో అన్నిరకాల సివిల్ కేసులు, భరణం కేసులు, బ్యాంకు వివాదాల కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఇటీవల నమోదవుతున్న కేసులను పరిశీలిస్తే కక్షిదారులు అనవసరపు బేషజాలకు పోకుండా కూర్చుని మాట్లాడుకుంటే సులభంగా పరిష్కరించుకోదగిననని, దీనివలన ఇరువురికి కాలం, ధనం వృథా కాదన్నారు. ఇరువురు సమన్వయంతో వ్యవహరిస్తే ఇద్దరు విజేతలుగా నిలుస్తారని ఈ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని న్యాయాధికారి తెలిపారు.



ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు: ఏడీఏ

పొన్నూరు టౌన్, ఆగస్టు 19: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వి.రామకోటేశ్వరి హెచ్చరించారు. సోమవారం పొన్నూరు పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో యూరియా, డీఏపీ, పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, వంటి ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎరువుల డీలర్లను ఆదేశించారు. డీలర్లు ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన అన్నిరకాల ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. మొదటి దఫా అవసరమైన ఎరువులు మాత్రమే రైతులు కొనుగోలు చేయాలన్నారు. ఎరువుల కొరత రాకుండా సకాలంలో రైతులకు ఎరువులు అందేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. మండలంలోని డీసీఎంఎస్ సెంటర్, నిడుబ్రోలు, పచ్చలతాడిపర్రు, దొప్పలపూడి, మునిపల్లె, చింతలపూడి, పెదపాలెం, భారతీనగర్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో కూడా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు కాంప్లెక్స్ ఎరువులను కూడా వినియోగించాలని సూచించారు. తనిఖీల్లో ఏవో డేగల వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకం: మల్లెల

పొన్నూరు టౌన్, ఆగస్టు 19: సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకం అని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. సోమవారం పొన్నూరు పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ వర్గీకరణ తీర్పు ఎస్సీ హక్కులను హరించే విధంగా ఉందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను విచ్చినం చేసేలా తీర్పు ఉందని ఆరోపించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏబీసీడీ వర్గీకరణ చట్టాన్ని సుప్రీం ధర్మాసం రద్దుచేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. 2004లో సంతోష్ హెగ్డే ఇచ్చిన తీర్పును ఒక్క సంఘం రివ్యూ కోరలేదన్నారు. 2011లో పంజాబ్ నుంచి వెళ్లిన పిటిషన్‌కు సంబంధించి విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం తాజా తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పుకు ఎట్టువంటి రాజకీయ పార్టీలకు కానీ, ఏ సంఘానికి కానీ సంబంధం లేదన్నారు. ఇప్పటివరకు రిజర్వేషన్ల ద్వారా కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే అవకాశాలు పొందారన్నారు. మిగిలిన 80శాతం ప్రజలకు అవకాశాలు నేటికీ లభించలేదన్నారు. క్రిమిలేయర్ విధానం ద్వారా ఉద్యోగి అయిన పిల్లలకు శాశ్వతంగా రిజర్వేషన్లు అందకుండా చేసే కుట్ర జరుగుతోందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు సాధించుకునేందుకు పోరాడుతామన్నారు. అందులో భాగంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఈ నెల 21న తలపెట్టిన భారత్ బంద్‌కు అన్ని సంఘాలు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అప్రజాస్వామిక రాజ్యాంగ వ్యతిరేక తీర్పులను నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీలు ఈ బంద్‌కు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మూకపంచశతి పారాయణం

పొన్నూరు టౌన్, ఆగస్టు 19: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం మూకపంచశతి పారాయణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి, కంచి కామాక్షి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కంచి కామాక్షి అమ్మవారిని శంకరులు స్తుతించిన 500శ్లోకాలను మహిళలు పారాయణం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో టి.గిరిజ శాంతకుమారి, సౌందర్య లహరి, కారుమూరి మంజుల, గుర్రం మాధురి తదితర పారాయణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో వీవీఐటీలో అధునాతన విద్య

● కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, ఆగస్టు 19: సంపూర్ణ క్రమశిక్షణతో కూడిన అధునాతన సాంకేతిక విద్య వీవీఐటీ కళాశాల అందిస్తుందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన 2024-25 విద్యా సంవత్సరం మొదటి ఏడాది విద్యార్థుల తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈఏపీ సెట్‌లో టాప్ ర్యాంకర్లుగా నిలిచి, కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతిప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ కళాశాలలోని మౌలిక వసతులు సీమన్స్ ఎక్సలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తిస్థాయిలో వినియోగించుకోవటం వలన విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ప్లేస్మెంట్ డీన్ ఎమ్ రఘురామ్, అడ్మిషన్ డైరెక్టర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరీ సూర్యదేవర బదరిప్రసాద్, అకడమిక్ డీన్ కె.గిరిబాబు, విభాగాధిపతులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బోనస్ పంపిణీ చేస్తున్న సంగం అధికారులు

పాల రైతులకు రూ. 2.27 లక్షల బోనస్ పంపిణీ

చేబ్రోలు, ఆగస్టు 19: చేబ్రోలు, కొత్తరెడ్డిపాలెంలో సోమవారం పాల రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కొత్తరెడ్డిపాలెం పాల సొసైటీ పరిధిలో 87 మంది పాల రైతులకు రూ.2,27,793 బోనస్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మోదుగుల సుబ్బారెడ్డి, సంగం డెయిరీ సిబ్బంది శ్రీకాంత్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

తెనాలి అర్బన్, ఆగస్టు 19: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం తెనాలి ఫొటోగ్రాఫర్లు ఘనంగా జరుపుకున్నారు. శివాజీ చౌక్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులో పేదలకు అన్నదానం చేశారు. మరుపురాని క్షణాలను మధురంగా అందించే ప్రక్రియ ఫొటోగ్రఫీ అని అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ చెప్పారు. ఫొటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునికతను అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కార్యదర్శి రఘు, రవిశంకర్, బాబి, శ్రీకాంత్, చిరంజీవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రహీమ్ సాహెబ్‌కు సత్కారం

పొన్నూరు టౌన్, ఆగస్టు 19: పట్టణానికి చెందిన ఆర్టీసీ కండెక్టర్ కవి, రచయిత రహీమ్ సాహెబ్‌కు కవి సత్కారం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన తెలుగు బాషా దినోత్సవ సంబరాలు ఆదివారం జరిగాయి. ఈ జాతీయ శాతాబ్ధి కవి సమేళనంలో పొన్నూరుకు చెందిన షేక్ రహీమ్ సాహెబ్ పాల్గొని అక్షరమే అభిమతం కవితా గానానికి ప్రశంసలు లభించాయి. అనంతరం రహీంను సత్కరించారు.